

అందని బిల్లులు

- సీజనల్ హాస్టళ్లకు చేరని డబ్బులు - నిర్వాహకులు, సిబ్బంది ఎదురుచూపులు



ఎమ్మిగనూరు మండలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వలసల నివారణకు ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్ల నిర్వహణ బిల్లులు, సిబ్బంది వేతనాలు ఇప్పటి వరకూ అందలేదు. దీంతో నిర్వాహకులు, సిబ్బంది బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు...

వలసల నివారణకు ప్రభుత్వం వలసలున్న ప్రాంతాల్లో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 71 సీజనల్ హాస్టళ్లను మంజూరు చేయగా వాటిలో ఐదు హాస్టళ్లుప్రారంభానికి నోచలేదు. సీజనల్ హాసళ్ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక (పొదుపు) సంఘాల మహిళలకు అప్పగించారు. తల్లిదండ్రులు వలస వెళ్లిన కుటుంబంలో విద్యార్థులను ఆ హాస్టళ్లలో చేర్చుకుని వారికి వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఉదయం, రాత్రి భోజన వసతి కల్పించడం ఈ హాస్టళ్ల ఉద్దేశం. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ముందు సొంత డబ్బులతో హాస్టల్ నడపాల్సి రావడంతో నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో పాటు పిల్లలతో పాటు వలసకు వెళ్లడంతో పిల్లలు లేక పోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేయలేదు. డిసెంబర్ నెలలో చాలా హాస్టళ్లను ప్రారంభించగా ఏప్రిల్ వరకూ నాలుగు నెలలకు పైగా హాస్టళ్లను నిర్వహించారు. నిర్వహణ ఖర్చులతో పాటు సిబ్బంది వేతనాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. సీజనల్ హాస్టల్‌లో పని చేసే వాలంటీర్‌కు నెలకు రూ.7వేలు, సహాయకులకు రూ.4వేలు, వంట మనిషికి రూ.5వేలు చొప్పున నెలకు చెల్లించాల్సి ఉంది. సీజనల్ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకూ ఒక్క రుపాయి కూడా అందలేదు. బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర స్థాయి అధికారుల బృందం ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సీజనల్ హాస్టళ్ల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా చేపట్టారు. అయినా ఇప్పటి వరకూ బిల్లులు అందకపోవడంతో అటు నిర్వాహకులు, ఇటు వాటిలో పని చేసిన సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

ఎదురుచూపులు తప్పడం లేదు

డ్రాపౌట్స్ నివారణ కోసం గ్రామాల్లో వలస కుటుంబాల పిల్లలకు సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు మండల స్థాయి అధికారులు చెప్పడంతో అధికారులు ఆదేశాల మేరకు హాస్టల్ ఏర్పాటు చేసాం. నాలుగు నెలలు నిర్వహించాం. ఇప్పటికీ ఒక్క బిల్లు కూడా రాలేదు. అప్పులు చేసి మరి హాస్టల్ నడిపించాం.

- లలితమ్మ, నిర్వాహకురాలు, పెద్దహరివాణం, ఆదోని మండలం.

జీతాలు రాలేదు..

సీజనల్ హాస్టల్ విద్యార్థులకు బోధనలు చెప్పేందుకు నాలుగు నెలలుగా పనులు మానుకొని విద్యార్థులకు విద్యాభివద్ధి కోసం కృషి చేశాం. అయితే ఇప్పటివరకు నాలుగు నెలల జీతాలు రాలేదు. అధికారులు అడిగితే మాత్రం విజయవాడలో పెండింగ్లో ఉన్నాయి, విజయవాడ నుంచి రావాలని సమాధానం చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా,రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించారు. మాకు గత నాలుగు నెలల కాలం జీతం రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి మా జీతాలు వచ్చేటట్లు చూడాలి.

- నాగరాజ్, సీజనల్ హాస్టల్ వాలంటరీ, ఆదోని మండలం.

త్వరలో జమ అవుతాయి...

సీజనల్ హాస్టళ్లకు సంబంధించి బిల్లులు రాకపోవడం వాస్తవమే. ఇప్పటికే రాష్ట్ర స్థాయి బృందం క్షేత్ర స్థాయిలో సీజనల్ హాస్టళ్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. త్వరలోనే బిల్లులు నిర్వాహకుల ఖాతాల్లో జమ అవుతాయి.

- కె.వేణుగోపాల్, ఎస్ఎస్ఎ అసిస్టెంట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్.

ఆర్‌డిఒలు, తహశీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రీ సర్వేకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడంలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శ్రద్ధగా పనిపై దృష్టి పెట్టి లక్ష్యాలను చేరుకోవాలని లేకపోతే తగు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టర్ పలు అంశాలపై జిల్లా మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలు ఎక్కువ ఉన్నప్పటికీ కూడా పురోగతి తక్కువగా ఉందన్నారు. నిర్లక్ష్యం వహించకుండా తగిన ప్రణాళిక రూపొందించుకొని ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఎఇలను ఆదేశించారు. గ్రౌండింగ్ పర్సంటేజ్ కి సంబంధించి హాలహర్వి మండలంలో ప్రోగ్రెస్ తక్కువగా ఉందని, ఈ మండలం పై ప్రత్యేక దృష్టి సారించాలని హౌసింగ్ పిడిని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఆర్డీఓ, తహసీల్దార్ లను అదేశించారు. స్టోన్ ప్లాంటేషన్‌కు సంబంధించి 2000 కి పైగా ఉన్న మండలాల్లో సంబంధిత ఆర్‌డిఒలు, తహసీల్దార్ లు ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని ఆదేశించారు. స్టోన్ ప్లాంటేషన్ పూర్తయిన గ్రామాల నుండి రోవర్లు తీసుకుని పని చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవన్నారు. భూ హక్కు పత్రాలు పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్తగా భూ హక్కు పత్రాలు వచ్చిన అన్ని మండలాలు కూడా పంపిణీ మొదలు పెట్టాలని, పంపిణీ చేయలేని వాటికి ఎందుకు పంపిణీ చేయలేకపోయారో కారణాలు చెప్పాలని జాయింట్ కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. ఆదోని మండలంలోని బైచిగేరి, దయ్యాలగూడెం, హొళగుంద మండలంలోని హోనూరు, కౌతాళం మండలంలోని తోవి, హాలహర్వి మండలంలోని కురలేహళ్లి గ్రామాలు గ్రౌండ్ ట్రూతింగ్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించలేకపోయారన్నారు. వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు.

భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భూహక్కు పత్రాలను పంపిణీ త్వరితగతిన చేపట్టండంతో పాటు భూరక్ష (సరిహద్దు రాళ్లను) వేగవంతంగా పూర్తి చేయాలని సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ జాయింట్ కలెక్టర్ కు సూచించారు. బుధవారం విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా రీసర్వే పనుల పురోగతి పై సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ రీసర్వే పనులలో భాగంగా ఇచ్చిన వారాంతపు లక్ష్యాలను గడువు లోపల పూర్తి చేస్తున్నామని సర్వే కమిషనర్‌కు వివరించారు. అదే విధంగా ఫేజ్-3 రీ సర్వేలో భాగంగా 160 గ్రామాలను రీసర్వే జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సర్వే ఎడి విజయ సారథి, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు నాగ ప్రసన్న లక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు రమాకాంత్ రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి నారపురెడ్డి మౌర్య

జీతాలివ్వకుంటే క్లాప్ ఆటోలు బంద్

సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ - కలెక్టరేట్ ఎదుట క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే ఆటోలు బంద్ చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం సాయంత్రం గాంధీ విగ్రహం సమీపంలో క్లాప్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ ఓల్డ్ సిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్ మారెళ్ళ విజయ్, రామాంజనే యులు మాట్లాడుతూ నగరాన్ని చెత్త లేని నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద్రాప్రదేశ్ క్లాప్ ఆటోలను నడిపే డ్రైవర్లకు 4 నెలల నుండి 9 నెలల జీతాలు పెండింగ్ లో ఉంచడం వలన వారి కుటుంబాలు పస్తులున్నారన్నారు. అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వకుండా, తక్కువ జీతాలు ఇస్తూ వారి జీతంలో నుండి ఇఎస్ఐ, పిఎఫ్ కటింగ్ చేస్తున్నారని, ఇఎస్ఐ కార్డు, పిఎఫ్ అకౌంట్లు ఇవ్వకుండా కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. కార్మికుల కడుపు కాలి కుటుంబాలను పోషించుకోన లేక అనేక ఇబ్బందులు పడుతూ అప్పులు చేసి బతుకుతున్నార న్నారు. కార్మికులు జీతాలు వారి హక్కులు అడగిన కార్మికులను ఏజెన్సీ వారు, మున్సిపల్ అధికారులు వేధిస్తూ పని నుండి అక్రమంగా తొలగిస్తున్నారన్నారు. వేధింపుల కారణంగానే ఇద్దరు కార్మికులు చనిపోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని, పని భద్రత కల్పించాలన్నారు. మున్సిపల్ అధికారులు, రెడ్డి ఏజెన్సీ సూపర్వైజర్ల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్లు అందరూ ఆటోలు నిలిపి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

దళిత రక్షణ యాత్ర పోస్టర్ విడుదల

- 22 నుండి 25 వరకు జీపుజాతా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా దళితుల, దళిత వాడల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న దళిత రక్షణ యాత్ర పోస్టర్లను బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు కార్మిక కర్షక భవన్లో విడుదల చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల పరిష్కారంతోపాటు, దళిత వృత్తిదారులకు బతుకు భద్రత, దళితులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు, నేటికీ కొనసాగుతుందన్నారు. అంటరానితనం, ప్రమోషన్లో రిజర్వేషన్లు ప్రధానమైన అజెండాలుగా ప్రతి దళిత వాడకు సమస్యను తీసుకుని వెళ్లే విధంగా ఈ దళిత రక్షణ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే కర్నూలు జిల్లాలో ఈనెల 22 నుండి 25 దాకా జీపుజాతా ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. 22న ఉదయం 10 గంటలకు పాత కర్నూలు పాత బస్టాండ్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమవుతున్న ఈ జీపు జాతా 25న మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్వగ్రామమైన పెద్దపాడు గ్రామంలోని సంజీవయ్య ఇంటిముందు ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జరుగుతున్న ఈ యాత్రను అన్ని వర్గాల ప్రజానీకం ఆదరించి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. భాస్కర్, జిల్లా నాయకులు ఎన్ .చక్రపాణి, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు కె. వెంకట రాముడు, కర్నూలు మండల కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.




జీపుజాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గురుకుల విద్యార్థులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిన్న టేకూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ఐఐటి నీట్ అకాడమీ ద్వారా శిక్షణ పొంది, మెడిసిన్, ఐఐటి, ట్రిపుల్‌ఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసిన విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా వారిని కలిసి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అకాడమీ ద్వారా శిక్షణ పొంది, మెడిసిన్, ఐఐటి, ట్రిపుల్‌ఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీలకు ఎంపికైన 52 మంది విద్యార్థులను బుధవారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెడిసిన్, ఐఐటి, ట్రిపుల్‌ఐటి, ఎన్ ఐ టి, సెంట్రల్ యూనివర్సిటీలకు 52 మంది విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. మెడిసిన్‌కు సంబంధించి 40 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా ,ఇందులో 20 మంది మెడిసిన్‌కు, 54 మంది విద్యార్థులకు గాను 32 మందికి ట్రిపుల్‌ఐటికి, ఐఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీకి 32 మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, గురుకుల కళాశాల ఐఐటి నీట్ అకాడమీ ప్రిన్సిపల్ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.





రూ. 6 కోట్లతో ఉల్చాల - కొత్తకోట రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండల పరిధిలో ఉల్చాల నుండి కొత్తకోట వరకు రూ. 6కోట్లతో చేపట్టిన రోడ్ నిర్మాణ పనులకు బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కమిషన్ల కొరకు కొట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి ఉండేదని అన్నారు. చాలా రోజుల నుంచి ఈ గ్రామాలకు అంబులెన్స్‌లో కూడా రాలేని పరిస్థితి ఉందన్నారు. మన జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న దృష్టికి తీసుకుపోవడమే తరువాయి మంజూరు చేశారన్నారు. కరోనా వల్ల కొద్దిగా కాలయాపన జరిగిన మాట వాస్తవమేనన్నారు. మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మళ్లీ నిధులు కేటాయించారన్నారు. ఈ రోడ్డు భూమి పూజ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోడుమూరు నియోజవర్గంలో అన్ని రోడ్లు పూర్తి చేసిన ఘనత జగనన్నకి దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో కొండాపురం, తిమ్మందొడ్డి, గూడూరు టు కోడుమూరు, రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తా వించి నిధులు శాంక్షన్ అయ్యేలా చర్యలు తీసుకొని ఈ రోడ్లు పూర్తి చేస్తా మని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపిపి వెంకటేశ్వరమ్మ వైసిపి నాయకులు నెహెమ్యా, జడ్పిటిసిలు ప్రసన్నకుమార్, మౌలాలి మాజీ జడ్పి టిసి సుదర్శన్ రెడ్డి, మాజీ చైర్మన్ తిరుమలరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు వాసు, ఉల్చాల సర్పంచి సాగర్, వైసిపి నాయకులు సంపత్, నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

రబీ సాగుకు సన్నద్ధమవ్వాలి : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో రబీ పంటల సాగులకు సన్నద్ధమవ్వాలని ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం నదీ తీర గ్రామాల్లో పత్తి, మిరప, ఉల్లి, కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ ఏడాది ఖరీఫ్ కాలం అంతంతమాత్రమేనని, ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు అధికారితో వాపోయారు. ఇక్కడే ఖరీఫ్‌లో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. రబీ పంటలపై ఆసక్తి చూపి సలహాల మేరకు సాగులు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, షరీఫ్, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు



రైతులకు సలహాలు ఇస్తున్న ఎఒ మల్లేష్

పత్తికొండను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలు లేక ఎండ ముఖం బట్టి నష్టం వాటిల్లిందని, పత్తికొండను కరువు మండలంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ , వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. బుధవారం కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి భవనంలో మీడియాతో ప్రజా సంఘ నాయకులు సిద్దయ్య గౌడ్ దస్తగిరి మాట్లాడుతూ పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాలలో రైతులు వర్షాధారం కింద పంట పొలాలను సాగు చేస్తారు. జూన్ , జులై,ఆగస్టు ,సెప్టెంబర్ మాసాలలో ఇప్పటివరకు 29 శాతం వర్షపాతం నమోదయిందని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో అరకొరా వర్షాలకు పత్తి, వేరుశనగ, టమోటా, కంది, సజ్జా ఆముదం తదితర పంటలను రైతులు సాగు చేశారని అన్నారు. పత్తి పంట తెగుళ్లతో ,మిగిలిన పంటలు ఎండు ముఖం పట్టి నష్టపోతున్నారని అన్నారు. బ్యాంకుల్లోని రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటల కు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 22, 23వ తేదీల్లో గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సచివాలయాల ముందు ధర్నా నిర్వహిస్తామని, 25న పత్తికొండ తహశీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా రైతులు, కార్మికులు ప్రజా సంఘ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుగ్గలి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రంగస్వామి పాల్గొన్నారు.



ఘనంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-కోడుమూరు

మూడో రోజు బుధవారం గణేష్ నమజ్జనం పలు గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగించి నిర్వహించారు. కోడుమూరు పట్టణంలోని మెయిన్ బజార్ వద్దనున్న శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో వీరశైవ లింగాయత్ దైవచార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన వీరశైవ వినాయకుడు విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. కోడుమూరు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు రిబ్బన్ కట్ చేసి, జెండా ఊపి..జై బోలో గణేష్ మహరాజ్ కి జై..జై అంటూ జేజేలు పలుకుతూ నిమజ్జనానికి వినాయకుని విగ్రహాన్ని తరలించారు.



పత్తికొండ: విధులలో ఎప్పుడు బిజీగా ఉండే అర్బన్ సిఐ మురళీమోహన్ గణేష్ నిమజ్జనంలో సరదాగా కనిపించారు. డప్పులకు లకు లయబద్ధంగా చేసిన నృత్యం చూపుదారులకు ఎంతో ఆకట్టుకుంది.

సి బెళగల్ : మండలంలో గణేష్ నిమజ్జన సంబరాలు ఆడంబరంగా జరిగాయి. మండలంలో 90 విగ్రహాలు కొలువు దీరగా మూడో రోజు నిమజ్జనం చేశారు. ఎస్ఐ పిరయ్య పోలీస్ సిబ్బందితో శాంతిభద్రతలపై గట్టి చర్యలు చేపట్టారు.

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి, పగిడిరాయి, ఎర్రగుడి, మారెళ్ల, రాతన, జొన్నగిరి, పెండేకల్లు, శబాష్పం తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వినాయకుని లడ్డు, చెరుకు,టెంకాయ తదితర వస్తువులను వేలాల ద్వారా భక్తులు దక్కించుకున్నారు. గ్రామాలలో పురవీధుల గుండా వచ్చిన వినాయకులు చెరువు కుంటలలో వినాయకుని నిమజ్జనం చేశారు. ఎస్ఐ మల్లికార్జున, జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి మండలంలో ఆగవేలి చుంచరగుడి పోతుగల్లు సంఘాల కంబల్లపాడు, గోకులపాడు, అమకతాడు గ్రామాలలో ఘనంగా వినాయకుని శోభయాత్ర చేసి వినాయక నిమజ్జనం చేశారు. ఎస్ఐ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉలిందకొండలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ప్రజల కోలాహల మధ్య వినాయకుని నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సంత మార్కెట్ నందు వెలసిన వినాయకుని నిమజ్జనంలో ఎస్ఎంకె యూత్ ఇవి రమణ ఆధ్వర్యంలో ఊరేగింపు కొనసాగింది. వినాయకుని లడ్డు వేలంపాటలో రూ.25 వేలకు ఓ భక్తుడు దక్కించుకున్నారు.



కోడుమూరులో ...

'తానా' నారీ సాహిత్యభేరికి మాసుంబీ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈనెల 24న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనానికి జోగులాంబగద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన టీచర్ పి.మాసుంబీని ఆహ్వా నించారు. తానా వారు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మ కమైన కార్యక్రమంలో కవిత్వం వినిపించటానికి తనకు విశిష్టమైన స్థానాన్ని కల్పించినందుకు తానా అధ్యక్షులు నిరంజన్ శృంగ వరపుకు , తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ లకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మాసుంబీ తెలుగు కవితలు, పాటలు రాస్తారు. అదేవిధంగా యాంకరింగు కూడా చేస్తారు. 200పైగా కార్యక్రమాలను ఆమె నిర్వహించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే శ్రీదేవికి వినతి

ప్రజాశక్తి-తుగ్గలి : జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవికి, ఎంపిడిఒ కార్యాలయంలో తుగ్గలి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు నాయక్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. ఉపాధి పత్రికలో కీలకంగా ఉన్న తమకు పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా మన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నాగిరెడ్డి, గోవర్ధన రెడ్డి, రాము నాయక్, సుంకన్న, బాలు, సుధాకర్ వివిధ గ్రామ పంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లు సీనియర్ మేటిలు పాల్గొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపిడిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

మైపర్‌లో ఎన్‌షూరింగ్ మెడికేషన్ సేఫ్టీపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మైపర్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా ఈరోజు వైద్య నిపుణులతో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఫార్మకో విజిలెన్స్ ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇది ఉజ్వల భవిష్యత్తును విద్యార్థులకు అందజేస్తున్న నదిగా కొనియాడారు. ఇందులో భాగంగా కర్నూల్ మెడికల్ కాలేజ్ ఫార్మకాలజి ప్రొఫెసర్ అండ్ హెచ్ఒడి, మానిటరింగ్ కోఆర్డినేటర్ విద్యార్థులకు ఫార్మకో విజిలెన్స్ హిస్టరీ ప్రస్తుత మెడికేషన్ సిస్టంలో దాని ప్రాముఖ్యతను తెలిపారు. అసిస్టెంట్ ప్రొపెసర్ ఎండి ఫార్మకాలజీ మెడికల్ కళాశాల డాక్టర్ జి. భాను ప్రకాష్ , డి సతీష్ కుమార్ మందులు వాడకంలో వచ్చే దుష్ఫలితాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ రాజ్ కుమార్, ఫార్మకో విజిలెన్స్ కోఆర్డినేటర్ ఆర్ రఘువీర్ ,అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అతిథులు



పెద్దహనుమంత రెడ్డి (ఫైల్)

సిపిఎం నేత పెద్దహనుమంతరెడ్డి మృతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సిపిఎం సీనియర్ నాయకులు పెద్దహనుమంత రెడ్డి మృతి చెందారు. పెద్దతుంబలం గ్రామానికి పెద్దహనుమంత రెడ్డి బుధవారం స్వగ్రామంలో గుండెపోటుతో మరణించారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి సభ్యులు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, రామాంజనేయులు, పట్టణం మండల కార్యదర్శులు లింగన్న,లక్ష్మన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామా ంజనేయులు, గ్రామ సభ్యులు కృష్ణమూర్తి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంత్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. హనుమంత్ రెడ్డి రైతు, కార్మిక సంఘాల్లో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పకడ్బందీగా ఓటరు ఇంటింటి సర్వే

- సబ్ కలెక్టర్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఓటర్ల ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నాని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలు నందు స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పకడ్బందీగా చేపడుతున్నామని ఒకే కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ బూతులో ఓటు వినియోగిం చుకునేలా చర్యలు తీసుకుంటున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఓటర్ల పరిశీలన సమయంలో వెరిఫికేషన్ సక్రమముగా చేసేలా చూడాలని, కొన్ని ప్రాంతాల్లో వలస వెళ్లిన కుటుంబాల ఓట్లను పరిశీలించాలని, ప్రతి ఓటరు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో ఓటు హక్కు అవగాహనపై జన సమూహం గల ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిం చాలని, సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఓటర్ల ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహిస్తున్నామని, సక్రమముగా నిర్వహించని వారి వివరాలను ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇంటింటి సర్వేలో పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, ఓటు నమోదు పై క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రచారం చేపట్టామని అవసరమైతే ఇంకా ఎక్కువగా ప్రచారం చేపిస్తామని, ప్రతి ఓటరు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా పోలింగ్ కేంద్రాల ను ఏర్పాటు చేస్తున్నామని సబ్ కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఎంపీడీవో గీతవాణి,ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - విలేకరులు

కోసిగి మండలంలో..



గోనెగండ్ల : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గణనాథులను నిమజ్జనం చేశారు. గోనెగండ్లలోని శివాలయం వీధిలో నిర్వహించిన లడ్డు వేలంపాట హోరాహోరీగా సాగగా.. రంగస్వామి శెట్టి రూ.42 వేలకు దక్కించుకు న్నారు. మండలంలో లడ్డూ ధర ఇంత భారీగా పలకడం ఇదే మొదటిసారి. ఎస్సై తిమ్మారెడ్డి బందోబస్తు నిర్వహించారు. **చిప్పగిరి :** మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. బంగారమ్మ అవ్వ దేవాల యం దగ్గర అధిష్టించిన గణపయ్య ప్రసాదం లడ్డును రూ. 5016 వేలం పాటలో రాము అనే భక్తుడు దక్కించుకున్నారు. ఎస్సై రమేష్ బాబు భద్రతా ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ ప్రేమ్ కుమార్ వినాయక కమిటీ సభ్యులు వెంకటేష్, వీరేష్, సూరి, సుధాకర్, రాజు, ప్రకాష్, గోరా, వినోద్, దివాకర్, వీరేష్ పాల్గొన్నారు. **కోసిగి :** మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలను మూడవరోజు నిమజ్జనం చేశారు. లడ్డు వేలంపాటలో పోటాపోటిగా నిర్వహించారు. **మంత్రాలయం :** మండలంలో వినాయక విగ్రహాలను ఊరేగించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో భద్రత నిర్వహించారు. **ఆలూరు:** ఆలూరు పట్టణ,గ్రామాలలో గణేశుడి నిమజ్జనం ప్రశాంతగా నిర్వహించారు. ఆలూరులో కోటవీధిలోని గణేశుడి విగ్రహాన్ని పురవీధులగుండా ఉరేగించి ఎల్ఎల్‌సి కాలువలో నిమ్మజ్జనం చేశారు. సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. **ఆస్పరి:** మండల పరిధిలోని వినాయ కుని విగ్రహాలను ట్రాక్టర్లు,ఆటోలలో పురవీధులగుండా ఊరేగింపుగా నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. **దేవనకొండ, పెద్దకడబూరు** మండలాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. మండల కేంద్రమైన దేవనకొండతో పాటు వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. యువకుల కేరింతలతో బాలికల నృత్యాలతో ప్రధాన వీధుల గుండా వినాయక విగ్రహాలు ఊరేగింపు చూపరులను ఆకట్టు కుంది. విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. మండల జెడ్పిటిసి కిట్టు, అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణు మహారాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్సై భూపాలుడు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కౌతాళం: కౌతాళం మండలంలో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కౌతాళం ఉపరహాల్ ఎరిగేరి హాల్వి, వల్లూరు, రౌడూరు ఆయా గ్రామాలలో గణేష్ నిమజ్జనం చేశారు. అంతకుముందే మండల వైసిపి కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, బిజెపి నాయకులు రామకృష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకులు మారుతి మోహన్, టిడిపి నాయకులు పూజలు నిర్వహించారు.

అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ, నీరు పంపిణీ

కౌతాళంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో మత సామ్రాజ్యానికి ప్రతికగా ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. హిందూ ముస్లిం సోదరులు అన్నదమ్ముల కలిసి అన్ని పండుగలు వైభవంగా జరుపుకోవాలని అన్నారు. ఆవాజ్ కమిటీ నాయకు లు సయ్యద్ దూద్ బాషా, కాజా హుస్సేన్, శిక్షావలి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



కౌతాళంలో అవాచ్ కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి : ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

బాల్యం దశలో చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదోనిలోని మున్సిపాల్ హైస్కూలు మైదానంలో 14,17 విభాగంలో బాలికలకు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకుముందు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి ఉత్సాహపరి చారు. విద్యార్థులతో కబాడీ ఆడి క్రీడల పట్ల ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాల న్నారు. క్రీడల్లోనే ప్రతిభ చూపిన వారికి రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని దీనివల్ల మంచి ఉద్యోగాల్లో చేరవచ్చని తెలిపారు. ఆడపిల్లలు సైతం క్రీడారంగంలో రాణిస్తున్నారని ఎవ్వరు అధైర్య పడరాదని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని మున్సిపల్ చైర్పర్సన్ శాంత, ఆదోని మండల విద్యాశాఖ అధికారి శివరాములు, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అలీ సిద్ధికి, కోసిగి బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యా యులు ఖలీల్ అహ్మద్, ఆదోని నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడల కోఆర్డినేటర్ నరసయ్య, ఆదోని మండలం ఎస్జీఎఫ్ క్రీడల ఇన్చార్జ్ రామన్న, నరసింహ మూర్తి, చిన్న ఈరన్న ఇతర వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు:** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఎమ్మిగనూరు మండల, నియోజక వర్గ స్థాయి క్రీడా పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమ ంలో తహశీల్దార్ మున్సిపల్ వైస్ చైర్మన్, కమీషనర్, పట్టణ అధ్యక్షుడు, ఎంఇఓ, కాలేజ్ హెచ్.ఎమ్, పిడి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి

జగన్‌ను ఇంటికి సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజు బుధవారం కొనసాగాయి. మేము సైతం అంటూ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మారెప్ప, నియోజకవర్గం యస్‌సి సెల్ దళిత నాయకులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తగిన బుద్ధి చెబుతాం అన్నారు. ఈ దీక్షకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు ముఖ్యఅతిథిగా హాజరై సంఘీభావం తెలపగా యస్‌సి సెల్ జిల్లా కార్యదర్శిలు యోబు, రాజాబాబు, మారేప్ప కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప డేని, తెలుగు రైతు జిల్లా ప్రదాన కార్యదర్శి వెంకటపతి రాజు,యస్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కూమర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మారెప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎస్సీ ఎస్టీలపై దాడులు హత్యలు అఘాయిత్యాలు పెరిగాయని అన్నారు. కార్పొరేషన్‌లు నిధులు లేక అలంకార ప్రాయమైయ్యాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ లు చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకుర్తి తిక్కారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దీక్షలో ఆశీనులయ్యారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తిక్కారెడ్డి ఎమ్మెల్యే కావాలని అన్నారు.

ఎమ్మిగనూరు : మాజీ ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్ రెడ్డి నాయకత్వంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్ యందు 8వ రోజుకు రిలే నిరాహార దీక్షలు చేరాయి. టిడిపి నాయకులు దయాసాగర్, రాందాస్ గౌడ్, కొండయ్య చౌదరి సుందర్రాజు రంగస్వామి గౌడ్ తురేగల్ నజీర్ అహ్మద్ గురురాజు దేశాయ్ మాబు సాహెబ్ దీక్షలో కూర్చొని మాట్లాడారు.

ఆదోని: టిడిపిలో మరో వర్గంగా ఉన్న సీనియర్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా టిడిపి నేతలు అంబేద్కర్ విగ్రహం దగ్గర మోకాళ్లపై దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీరూఫ్ మాట్లాడుతూ అధిష్టానం చెప్పేవరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సంభగల్ ఫక్రుద్దీన్, సోమశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు రామచంద్ర, మల్లికార్జున, నారాయణపురం షాషావలి,



ఆదోని: మోకాళ్ళ పై నిలచి నిరసన తెలుపుతున్న నేతలు

కారుమంచి, శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, మద్దికేర రామకృష్ణ, మైనార్టీ నాయకులు ఎండి హుస్సేన్ , ఇస్మాయిల్ బాష, కన్నె జగదీష్, బద్రి స్వామి, పకీరప్ప ,రాముడు ,రమేష్ ,తిమ్మప్ప శ్రీనివాస్ ఉన్నారు.

టీడీపీ ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో

ఆదోనిలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద బాబుతో నేను సంతకాల కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ జైలు నుంచి కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటికొచ్చి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దీక్షల్లో రెడ్డి సోదరులు బుద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, శశి రెడ్డి, లోకనాథ్ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నర రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి కూర్చున్నారు.

ఆలూరు: టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక నిరాహారదీక్షలో టిడిపి రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి బోయ సాదికారత కమిటీ కన్వీనర్ భాస్కర్ నాయుడు, వాల్మీకులు, తెలుగు రైతు సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. మండల కన్వీనర్లు అశోక్ యాదవ్, తిప్పయ్య, జిల్లా నాయకులు సురేంద్ర, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల స్వప్నం నెరవేరింది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని



విద్యార్థుల తో మాట్లాడిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని విద్యార్థులు సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల ఏర్పాటు స్వప్నం నెరవేరిందని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోనే వైఎంకె హైస్కూల్ భవనంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఏ, బీకాం, బీఎస్సీ, బోటని కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మొదటి విడతగా ప్రస్తుతం కోర్సులు కొనసాగుతా యని, రానున్న కాలంలో ప్రాధాన్యత గల కోర్సులు ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ శివారెడ్డి మాట్లాడుతూ 26 మంది డిగ్రీ విద్యార్థులతో క్లాసులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాంత, లెక్చలర్లు రాఘవేంద్ర, కిరణ్ కుమార్, బసవరాజు నాయకులు నరసింహమూర్తి, చిన్న ఈరన్న ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణ శివారులోని దెబ్బతిన్న బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సభ్యులు బుధవారం పరిశీలించారు. కమిటీలో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్యాదవ్,ఎస్.ఈ శివకుమార్ రెడ్డి,ఈ.ఈ సుబ్బారావు, డి.ఈ కేదారేశ్వర రెడ్డి తదితరులు బృందంలో ఉన్నారు. ట్యాంక్ దెబ్బ తినడానికి గల కారణాలను అన్వేషించారు.

మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించామన్నారు. త్వరలో నివేదికను అందించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ రాధాకృష్ణ, డీఈలు నాగభూషణ్ రెడ్డి,రాజు నాయక్, ఏఈ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ పనిచేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి

ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి అమ్రేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివద్ధి పనులలో మండల గ్రామ నాయకులకు సమాచారం అందించాలన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుబడిన ఘనత జగన్మోహన్ రెడ్డికే చెందుతుం దన్నారు. విద్యుత్ శాఖ మండలాధికారిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలని ఆయనకు హెచ్చరించారు. అనంతరం బాపురం గ్రామంలో 35 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయంను ప్రారంభించారు.

దళితుల స్మశానానికి స్థలం కేటాయింపు :

మండల పరిధిలోని రౌడూరు గ్రామంలోని దళితులకు స్మశాన స్థలం కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. 87 సెంట్ల స్థలం కు సంబంధించిన పత్రాలను ఆ గ్రామ పాస్టర్‌కు అందజేశారు..ఈ కార్యక్రమంలో నాయకులు దట్ల కృష్ణంరాజు, వీర సేన రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, ఏకం రెడ్డి, బసవ ప్రభు, మరి గౌడ్, ఎంపీపీ అమ్రేష్, జడ్పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి కో ఆప్షన్ నెంబర్ మాబు సాబ్ సర్పంచ్ పాల్ దినకరన్, తదితరులు పాల్గొన్నారు.

కౌతాళంను కరువు మండలంగా ప్రకటించండి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలా నాగిరెడ్డిని కోరారు. బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కే మల్లయ్య మాట్లాడుతూ మండలంలో ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు తీవ్ర నష్టపోయారన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలైపోయారని పేర్కొన్నారు. పది ఎకరాల భూములు ఉన్న రైతులు సైతం ఇతర ప్రాంతాలకు బతుకుతెరువుకు వలస వెళుతున్నారని అన్నారు. గ్రామాన్ని యూనిట్ గా తీసుకొని క్రాప్ ఇన్సూరెన్స్ మంజూరు చేస్తూ, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా మండలంలో ప్ర దానమైన రోడ్లన్నీ దెబ్బతిని గుంతలమయం కావడం జరిగిందని, కొత్తగా రోడ్ల వేయాలని ఎమ్మెల్యేకి జనరల్ బాడీ సమావేశంలో మెమోరాండం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మ్యాలిగానురు దగ్గర వరద కాలువ కోసం కృషి చేస్తానన్నారు. రోడ్లు వేయడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశులు, మేలిగిరి ఈరన్న, రైతు సంఘం నాయ కులు ఉలిగయ్య, రామలింగ, మారయ్య, లింగప్ప వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న బోధన శ్రీకారం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినూత్నమైన రీతిలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల బృందం. బుధవారం విద్యార్థిని విద్యార్థుల చేత భారతదేశ పటం ఆకారంలో విత్తనాలను మొలకెత్తించి ఆ పటం ద్వారా వారికి అన్ని అంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అన్ని రకాల రంగులను ఉపయోగించి రాష్ట్రాల రాజధానులు, సరిహద్దులు, భూస్వరూపాలు, పీఠభూమి, మైదానాలు ఇలా అన్ని అంశాలను పిల్లలకు సరళంగా బోధించారు. విద్యార్థులలోని సృజనాత్మకత వెలికి తీసేందుకు దోహద పడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అబ్దుల్ సలీం, మహబూబ్ బాషా, లక్ష్మి కాంత్ రెడ్డి, గుమ్మల బాబు,నసీమ,మణికుమారి రమిజబీ పాల్గొన్నారు.



మొలకెత్తిన విత్తనాల పటం వద్ద ఉపాధ్యాయులు

ఎల్లప్పకు ఘన నివాళ్లు

- అంత్యక్రియల్లో పాల్గొన్న సిఐటియు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ



నివాళులర్పించిన సిఐటియు, సిపిఎం నాయకులు

ఆటో యూనియన్ సీనియర్ నాయకులు న్యూ సిటీ ఉపాధ్యక్షులు బి.ఎల్లప్పకు సిఐటియు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. అనారోగ్యంతో ఎల్లప్ప మంగళవారం మరణించిన సంగతి తెలిసిందే. ఎల్లప్ప పార్థివ దేహాన్ని వారి స్వగ్రామమైన దేవనకొండలో బుధవారం అంత్యక్రియలు జరిగాయి. విషయం తెలుసుకున్న ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే .ప్రభాకర్, సిపిఎం దేవనకొండ మండల కార్యదర్శి వీరశేఖర్, ఆటో యూనియన్ సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి రాధాకృష్ణ, అధ్యక్షులు హుస్సేన్ వలి, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీలు ఆయన నివాసంలో ఉంచిన పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పిం చారు. అనంతరం అంతక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్లప్ప ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించేవాడని పేద,బడుగు బలహీన వర్గాల ఐక్యతకు ఎనలేని కృషి చేశారన్నారు. కర్నూలులో వీకర్ సెక్షన్ కాలనీ ఏర్పడిన నాటి నుంచి పేదలకు ఇళ్లస్థలాలు, మురుగునీరు, మంచినీటి సౌకర్యం కోసం ప్రభుత్వపై కార్పొరేషన్ అధికారులపై జరిగిన అనేక పోరాటాల్లో ముఖ్యపాత్ర వహించారని వారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పోరాటాల్లో ప్రధాన పాత్రగా ఉంటూ ఎక్కడ ఆటో కార్మికునికి అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారం చేసేవారని వారన్నారు. ఎల్లప్ప మరణం వారి కుటుంబానికి ఆటో యూనియన్ కు తీరని లోటుని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు ఆటో యూనియన్ నాయకులు మళ్లీ, నబి సిఐటియు దేవనకొండ మండల కార్యదర్శి అశోక్, సిపిఎం నాయకులు మద్దిలేటి, జానీ, రమణ, జమ్మన్న. తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

ప్రచార జాతాను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఈనెల 22న కర్నూలు జిల్లాలో జరిగే యుటిఎఫ్ ప్రచార జాతాలు జయప్రదం చెయ్యాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టీ.గాదిలింగప్ప, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వై.రామాంజనేయులు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ యుటీఎఫ్ ఆవిర్భవించి ఆగస్టు10, 2023 నాటికి 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50వ వసం తంలోకి ప్రవేశించిన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు ఆగస్టు 10, 2024 వరకు జరుగుతా యన్నారు. విజయవాడలో అక్టోబర్1న ప్రారంభ య్యే స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవ ప్రచార యాత్ర (జాతా) రెండు ప్రాంతాల్లో ఈనెల 21న బైక్ యాత్ర ప్రారంభం అవుతాయని, హిందూపురంలో 21న ప్రారంభమైన బైకు ప్రచార (జాతా) యాత్ర 22న కర్నూలు జిల్లా పత్తికొండలో ఉదయం ప్రారంభమై కోడుమూరు,కర్నూలు కేంద్రాలలో జరుగుతాయన్నారు. ఈనెల 22న కర్నూలు జిల్లాలో జరిగే స్వర్ణోత్సవాల ప్రచార యాత్ర (జాతా)లో ఉపాధ్యాయులు యుటిఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్ లింగన్న, ఉరుకుందయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్, ఐదుగురు హోంగార్డులు సస్పెండ్

- చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం : ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శ్రీశైలం దేవస్థానం పరిధిలో పేకాట ఆడిన ఒక కానిస్టేబుల్, ఐదుగురు హోంగార్డ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీస్ సిబ్బంది చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైల దేవస్థానంలో ఈ నెల 18న పోలీసు డిపార్ట్మెంట్‌కు సంబంధించి కానిస్టేబుల్, ఐదుగురు హెూంగార్డ్‌లు పేకాట ఆడుతున్నారని సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఘటనపై స్పందించారు. పోలీస్ అధికారులతో సంబంధిత వీడియోపై నివేదిక తీసుకుని వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

- 'జగనన్నకు చెబుదాం'కు సమస్యల వెల్లువ
- అధిక సంఖ్యలో భూ సమస్యలపై అర్జీలు



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలు వెల్లువలా వచ్చాయి. అధిక సంఖ్యలో భూముల సమస్యలపై రావడంతో కలెక్టర్ మండలంలోని రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల అధికారులు సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు ఇంత పెద్ద ఎత్తున వినతులు ఎందుకు ఇస్తారని అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జగనన్నకు చెబుదాం-స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలు ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుండి దాదాపు 120 వినతులు అందజేశారు. భూముల ఆన్‌లైన్, కొలతలు, సరిహద్దు సమస్యలు, ఇంటి పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, రెవిన్యూ సంబంధించి వినతులు అధిక సంఖ్యలో వచ్చాయి. పంచాయతీరాజ్ శాఖ సంబంధించి రోడ్లు, డ్రెయినేజీ, పక్కా గృహాలు, శానిటేషన్ తదితర సమస్యలతో పాటు అన్ని శాఖలకు సంబంధించిన వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు శాఖలకు పంపారు. పెద్ద ఎత్తున అర్జీలు రావడం పట్ల జిల్లా కలెక్టర్, జెసిలు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం గ్రామ సచివాలయంలో మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించినప్పుడు సమస్యలు పరిష్కరిస్తారని భరోసా ప్రజలకు అధికారులు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండలంలో చాలా కాలం నుండి సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఉన్నాయని, అధికారులు జవాబుదారీతనంగా పని చేస్తే అర్జీదారులు సమస్యలు తీసుకుని తమ వద్దకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ఇప్పటి నుండి అయినా స్పందన అర్జీల పరిష్కారం, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికార యంత్రాంగం ప్రజాసేవ చేయడం కోసం ఉన్నామని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇలాంటి సమస్యలు మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్‌కరు, జాయింట్ కలెక్టర్‌లకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి శాలువా, బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ పుల్లయ్య, ఆర్‌డిఒ దాసు, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి
రూ. 10 లక్షలు ఇవ్వాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

మండలంలోని నందికుంట గ్రామానికి చెందిన రైతు మైలా శ్రీనివాసులు(37) కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రైతు శ్రీనివాసులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే... రైతు కుటుంబాన్ని ఎపి రైతు సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో గిట్టుబాటు ధరలు లేక చేసిన అప్పులు తీర్చలేక ప్రతిరోజు ఏదో ఒక మండలంలో రైతులు ఆత్మహత్య చేసు కుంటూనే ఉన్నారని తెలిపారు. ఈ ఆత్మహత్యలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే బాధ్యత వహించా లన్నారు. గత ఆరు సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టి, మరొకవైపు కల్తీ విత్తనాలు, కొద్దో గొప్పో పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడం, పెట్టుబడి కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేసి, వ్యాపారుల ఒత్తిడిని భరించలేక నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారని తెలిపారు. శ్రీనివాసులకు 11 సంవత్సరాల కూతురు, భార్య, తల్లిదండ్రి ఉన్నారని తెలిపారు. శ్రీనివాసులు కూతురును చదివించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, మాభాష, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు, భూ సాగుదారులు

సాగుదారులకే పట్టాలివ్వాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా.. - కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలు 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఆ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు డేవిడ్, రామచంద్రుడు, సుబ్బారాయుడులకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు అనుమతి ఇవ్వగా అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి సాగులో ఉన్న పేదలకు పట్టాలు ఇచ్చి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని చాలా కాలం నుండి ప్రజాప్రతినిధులకు, రెవిన్యూ అధికారులకు విన్నవిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపించాలని కోరారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ తహశీల్దార్‌ను, డిప్యూటీ తహశీల్దారును వివరణ కోరగా కిందిస్థాయి సిబ్బంది అలాంటి భూములు లేవని తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వెంటనే స్పందించి పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు 17 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎంపీడీవోకు ఈ వారంలో పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు, సిఐటియు నాయకులు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

- 11 మండలాల్లో వేడుకలు - కోటకందుకూరులో వైసిపి, టిడిపి మధ్య ఘర్షణ
- అవుకు రిజర్వాయర్, తెలుగు గంగ, కెసి కెనాల్, చెరువుల్లో నిమజ్జనం

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను మూడవరోజు నిమజ్జనం చేసేందుకు అవుకు రిజర్వాయర్ వద్దకు సాంప్రదాయ నృత్యాల నడుమ తీసుకొచ్చారు. రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. వేడుకల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా అవుకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. **కొత్తపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. కొత్తపల్లి, నందికుంట, లింగాపురం, శివపురం, ముసలమడుగు, దుద్యాల గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. ఎస్సై హుస్సేన్ భాష ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **రుద్రవరం :** మండలంలోని నరసాపురం గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ సమీపంలో నిమజ్జనం చేశారు. పలువురు ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో వాగులు, కుంటలు, చెరువుల్లో వినాయకుని నిమజ్జనం చేశారు. **పాములపాడు :** పాములపాడు మండలంలో ఎర్ర గూడూరు గ్రామం సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువలో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక, ఎస్సై ఓబులేసు, ఈవోఆర్డి శ్రీనివాసులు నాయుడు మొదటి వినాయకునికి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించారు. ఆత్మకూరు పట్టణం నుండి, కరివేన బానముక్కల ఎర్ర గూడూరు గ్రామాల నుండి దాదాపు 64 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ఆత్మకూరు పట్టణంతో పాటు గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. పాములపాడు, రుద్రవరం, తుమ్మలూరు, కృష్ణరావుపేట, లింగాల, చెలిమిల్ల గ్రామాల విగ్రహాలను వారికి అందుబాటులో ఉన్న తెలుగు గంగ, కెసి కెనాల్‌లలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఏసయ్య పోలీస్ సిబ్బంది రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **మిడుతూరు :** మిడుతూరులో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిశాయి. రోల్లపాడు సమీపంలో ఉన్న ఎస్సార్‌బీసీ కాలువలో నిమజ్జనం చేశారు. పోలీసులు ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. **వెలుగోడు :** వెలుగోడు పట్టణంలో 40కి పైగా ప్రతిష్ఠించిన గణనాథులు మూడు రోజులపాటు పూజలను అందుకొని నిమజ్జనానికి తరలి వెళ్లాయి. వినాయకుల వద్ద ఉంచిన లడ్డూ వేలం పాటలు పోటీగా సాగాయి. గంగా బావి వీధి వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన లడ్డు పెంట్లవల్లి బాలమ్మ కుమారులు నాగేశ్వరరావు, రవికుమార్ రూ. 54,300లకు, ద్వారక నగర్‌లో రూ. 50 వేలు, చెంచు కాలనీలో రూ. 52 వేలకు భక్తులు దక్కించుకున్నారు. గ్రామ సర్పంచ్ వేల్పుల జైపాల్ వినాయకుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడంతో ప్రశాంతంగా జరిగింది. పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని సిఐ ఇస్మాయిల్, వెలుగోడు ఎస్సై వెంకటప్రసాద్, మిద్తూర్ **మిగతా 6వ పేజీలో...**

కోటకందుకూరులో వైసిపి, టిడిపి ఘర్షణ

- పది మందికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జనోత్సవం ఊరేగింపులో టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. మొత్తం 10 మంది గాయపడ్డారు. ఊరేగింపు జరుగుతుండగా నాయకుల మధ్య మాట మాట పెరిగి పరస్పరం రాళ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో వైసిపికి చెందిన గ్రామ సర్పంచి భర్త చంద్రశేఖర్ , దుర్వేసుల వెంకటరమణతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే టిడిపికి చెందిన ఏడు మంది గాయపడ్డారు. దీనితో గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆళ్లగడ్డ రూరల్ ఎస్సై నరసింహులు హుటాహుటిన గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అవుకు రిజర్వాయరులో గణేష్ నిమజ్జనం చేస్తున్న దృశ్యం



పాములపాడు మండలం ఎర్రగూడూరు సమీపంలోని తెలుగ గంగ కాల్వ వద్ద నిమజ్జనం ప్రారంభిస్తున్న అధికారులు



డోన్ : నిమజ్జనం వేడుకలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్



మృతి చెందిన రైతు ప్రతాప్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - చాగలమర్రిల : మండలంలోని ముత్యాలపాడు శివారులోని రామాపురం పొలాల్లో విద్యుత్ షాక్‌తో రైతు ప్రతాప్(35) మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రతాప్ ముత్యాలపాడు రెవెన్యూ పొలిమేరలోని తనకున్న పొలంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. పొలంలో స్టాటర్ వద్ద మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

జోరుగా జొన్న పంట సాగు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని పలు గ్రామాలలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంట సాగు చేయాల్సిన భూమిలో రైతులు జోరుగా జొన్న పంట సాగు చేస్తున్నారు. రుద్రవరం, ఆర్ కొత్తపల్లి, ఆర్ కొత్తూరు, కొండమాయపల్లి, చందలూరు, మందలూరు, పేరూరు, చిలకలూరు, రెడ్డిపల్లి, తువ్వపల్లి, ఆర్ నాగులవరం, తిప్పారెడ్డిపల్లి, టి లింగం దిన్నె, ఎర్రగుడిదిన్నె తదితర గ్రామాలలో మెట్ట భూములతో పాటు చెరువుల కింద ఉన్న భూమిలో జొన్న పంట సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఆరుతడి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అడపాదడపా కురిసిన వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 6000 ఎకరాల్లో మొక్కజొన్న, మినుము తదితర పంటలను రైతులు సాగు చేశారు. గత ఏడాది రబీ సీజన్‌లో రైతులు దాదాపు 2 వేల ఎకరాల్లో పైగా జొన్న పంట సాగు చేస్తే ఈ ఏడాది దాదాపు 3 వేల ఎకరాలపైగా రైతులు జొన్న పంట సాగు చేస్తున్నారు. తెలుగంగ ప్రధాన కాలువ కాలువ నుంచి చెరువులకు నీరు అరకొరగా వస్తూ ఉండడంతో చెరువు కట్ట ఆనుకొని ఉన్న భూమిలో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. కట్టకు దూరంగా ఉన్న భూమిలో రైతులు విస్తారంగా జొన్న పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది క్వింటా జొన్నలు రూ.3 వేలకు పైగా గిట్టుబాటు ధర పలికింది. దీంతో రైతులు జొన్న పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జోరుగా జొన్న పంట విత్తనం వేస్తున్న రైతులు



ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లెలో ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కాషాయ తోట ఆవరణంలో రూ. 86 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ ఆయుర్వేద విశిష్ట వైద్యశాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయుష్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుమార్ బాబు భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ ప్రజల కల నేడు నెరవేరబోతుందని, ఎన్నో సంవత్సరాల నుంచి సొంత భవనం లేక వెలవెలబోతున్న సూపర్ స్పెషాలిటీ ఆయుర్వేద ఆసుపత్రికి త్వరలోనే పూర్వ వైభవం రానుందని తెలిపారు. ఆయుర్వేద వైద్య చికిత్స కోసం బనగానపల్లె ప్రాంతం నుండే కాక సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చేవారని తెలిపారు. ఇక్కడ గతంలో పంచకర్మ చికిత్స కూడా అందుబాటులో ఉండేదని, భవనం శిథిలావస్థకు చేరుకోవడం వసతులు లేక ప్రభుత్వ ఆసుపత్రి దీనావస్థకు చేరుకుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో రూ. 86 లక్షలతో భవన నిర్మాణం తో పాటు మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే బనగానపల్లె నియోజకవర్గ ప్రజలందరికీ ఆయుర్వేద వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె .మాధవరావు చౌదరి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎంపీడీవో శివరామయ్య, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపిపి మానసవీణ, పట్టణ సర్పంచి ఈసారి ఎల్లమ్మ, గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్ భాషా, వార్డు మెంబర్ సురేష్, ఎంపిటిసి వెంకటసుబ్బయ్య, నాయకులు అబ్దుల్ ఫైజ్, డాక్టర్ మహ్మద్ హుస్సేన్, బండి బ్రహ్మానంద రెడ్డి, సీనియర్ న్యాయవాది మాధవరెడ్డి, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఫోటో రైట్ అప్ ఆయుర్వేద వైద్యశాల గదుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయుర్వేద వైద్యశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 20 బిపిఎల్ 1,2



టీ షర్టులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

గణేష్ ఉత్సవ కమిటీలకు టీ షర్టులు పంపిణీ

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాలలోని గణేష్ ఉత్సవ కమిటీలకు టీ షర్టులు పంపిణీ చేసినట్లు సర్పంచు పెరుమాళ్ళ శేషన్న బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. జడ్పిటిసి పుల్యాల దివ్య, వైసిపి మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి దంపతుల కుమారుడు పుల్యాల చరణ్ రెడ్డి జ్ఞాపకార్థం జడ్పిటిసి దంపతులు, కుమారుడి ఫోటోతో ముద్రించిన టీ షర్టులను గణేష్ ఉత్సవ కమిటీకి ఉచితంగా పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో మధు నాయుడు, వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతో బ్లడ్ క్యాన్సర్ నయం

- కీమో థెరపీ, ఇమ్యునో థెరపీ, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌తో చికిత్సలు
- ప్రతి నెలా మూడవ బుధవారం నంద్యాలలోనే క్యాన్సర్‌కు వైద్య సేవలు
- ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ గణేష్ జై షేత్వార్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బ్లడ్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే నయమయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయని, కీమో థెరపీ, ఇమ్యునో థెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌తో ఈ క్యాన్సర్‌కు చికిత్సలు అందించవచ్చని ప్రముఖ సీనియర్ హెమటాలజిస్ట్, బిఎంటి స్పెషలిస్ట్ డాక్టర్ గణేష్ జైషేత్వార్ అన్నారు. రక్త క్యాన్సర్ వస్తే చనిపోతారనే అపోహ నుండి ప్రజలు బయట పడాలని పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ మాసం సందర్భంగా బుధవారం నంద్యాల పట్టణంలోని హోటల్ సూరజ్ గ్రాండ్‌లో బ్లడ్ క్యాన్సర్‌పై విజయం సాధించిన విజేతలతో బ్లడ్ క్యాన్సర్ సర్వేవర్స్‌మ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా క్యాన్సర్ బారిన పడి చికిత్స ద్వారా నయం చేసుకుని జీవితాన్ని సాగిస్తున్న ప్రముఖుల గురించి వివరించారు. ఈ ఏడాది ప్రపంచ బ్లడ్ క్యాన్సర్ డే థీమ్ 'నేటి నిర్ధారణ-రేపటి ఆశ' అన్నారు. రాయలసీమ ప్రాంతంలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో అత్యంత అత్యాధునాతన చికిత్సతో నయం చేశామన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన రాముడు కాల్వ 4 సంవత్సరాల క్రితం ప్రాణాంతక రక్త క్యాన్సర్ (అక్యూట్ మైలోయిడ్ లుకేమియా) రాగా కీమో థెరపీ, బోన్ మ్యారోట్రాన్స్ ప్లాంట్ చేయించుకొని పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. శ్రీశైలం ప్రాంతానికి చెందిన 55 ఏళ్ల లీలావతి బ్లడ్ క్యాన్సర్ నుండి ఉపశమనం పొందారన్నారు. ప్రతి చిన్న జబ్బుకు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు నంద్యాల పట్టణంలోని నంద్యాల నియోటల్ క్రిటికల్ కేర్‌లోనే ప్రతి నెలలో మూడవ బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. బ్లడ్ క్యాన్సర్ జబ్బులకు ఇక్కడే వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మేనేజర్‌లు రాధ క్రిష్ణ, చిదంబర రావు, ప్రాంతీయ సమన్వయ కర్త రమణ, క్యాన్సర్ నుండి విముక్తి పొందిన విజేతలు రాముడు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జై షేత్వార్

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శ్రీశైలం వచ్చిన ఎమ్మెల్యే మొదటి రోజున దేవస్థానం గణేష్ సదన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు పాల్గొన్నారు. రెండవ రోజు వైసిపి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత స్వామి దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం ముందుగా స్వామివారిని ఆతరువాత అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నదాన పథకానికి దాత విరాళం

శ్రీశైల దేవస్థానంలోనినిత్య అన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన వి. బంగారు రాజు 1 లక్ష 500 రూపాయలను విరాళంగా దేవస్థానం పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు. దాతకు స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వైద్య సేవలను వినియోగించుకోండి : గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆళ్లగడ్డ నూతన 50 పడకల ఆసుపత్రిలో 'ఆయుష్మాన్ భవ' వారానికి ఒకసారి స్పెషలిస్ట్‌ల ద్వారా ప్రత్యేక ఆరోగ్య సేవలు అందించే మహత్తర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 8 కోట్లతో ఆసుపత్రిలో మరో రెండు అంతస్తుల భవనం నిర్మిస్తున్నామని, ఉత్తమ వైద్య సేవలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమం ద్వారా ప్రసూతి, చిన్న పిల్లల, శస్త్రచికిత్స, ఈఎన్టి, మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. వారానికి ఒకసారి ఈ వైద్య నిపుణులు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్ బాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత, మండల అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహశీల్దార్ హరినాథ్ రావు, వైసిపి పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, షేక్ ఆజాద్, నజీర్, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.






టీ షర్టులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

యువకులకు టీ షర్టులు పంపిణీ

ప్రజాశక్తి - పగిడ్యాల

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీలకు టీ షర్టులను బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి నాయకుడు పుల్యాల సత్యానారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు పుల్యాల రాజశేఖర్ రెడ్డి టీ షర్టులపై పుల్యాల సత్యానారాయణ రెడ్డి ఫొటో ముద్రించి 35 మంది యువకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వోగిలి శ్రీను, బోయ వెంకటేశ్వర్లు, చిన్న, పాండు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

23 నుండి దళిత రక్షణ యాత్ర

- జయప్రదం చేయండి: కెవిపిఎస్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ఈ నెల 23 నుండి 25 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా నాయకులురాలు కే.రంగమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని ఏబీఎం పాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై, మహిళలపై, దళితులపై హత్యలు, అత్యాచారాలు ఎన్నో జరుగుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించి, దళితులకు ఉచితంగా విద్యుత్తును 200 యూనిట్ల నుంచి 300 వరకు కల్పించాలని, భూమి లేని దళిత కుటుంబాలకు భూమి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డప్పు కళాకారుల నాయకులు సుంకన్న, దేవదాసు, ఆమని, శేషన్న, ఈశ్వరయ్య, చిన్న సుంకన్న, మద్దూరు లింగయ్య, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణను ఓర్వలేకనే అక్రమ అరెస్టులు

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయించారని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం సమీపంలో 8వ రోజు సామూహిక నిరాహార దీక్షలు వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ దీక్షలకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిందని విమర్శించారు. త్వరలో చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా విడుదలవుతారని పేర్కొన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న తెలుగు వాణిజ్య విభాగం నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు రేగటి నాగిరెడ్డి, జనరల్ సెక్రెటరీ జగదీశ్వర రెడ్డి , మండల అధ్యక్షుడు బత్తుల గోపాల్ రెడ్డి, నాయకులు పసుపల కామేష్, జోలాపురం తలారి హరి కృష్ణ, మంగదార శేష ప్రసాద్, వార్డు మెంబర్ లాయర్ నాగేంద్ర రెడ్డి, మండల కార్యదర్శి ఖాదర్ భాష, మాధవ, కుళ్ళాయి, ఆరిఫ్, పల్లం బసవయ్య, శేఖరప్ప సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక బస్టాండ్ ఎదురుగా కొనసాగుతున్న దీక్షలు 8వ రోజుకు చేరాయి. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కలిముల్లా ఆధ్వర్యంలో భారీ ఎత్తున ముస్లిం మైనార్టీలు దీక్షలో పాల్గొన్నారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టిడిపి జిల్లా ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావాన్ని ప్రకటించారు. **ప్యాపిలి :** ప్యాపిలిలోని ఏకలవ్యుని విగ్రహం వద్ద టిడిపి నాయకుల ఆధ్వర్యంలో 'బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం' రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో టిడిపి రాష్ట్ర బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. నాయకులు రాఘవేంద్ర, గౌతమ్ రెడ్డి, అంకిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామ సుబ్బయ్య, రామ్మోహన్ యాదవ్, చిన్న సుంకయ్య, సుదర్శన్, ప్రసాద్ రెడ్డి, సత్యం, మల్లికార్జున, నాగేంద్ర, ఖాజా పీర్, అలీ, పీర, మధు, ఎస్కె వలి, ఆర్ని మద్దిలేటి పాల్గొన్నారు. **బేతంచర్ల :** చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసనగా పట్టణంలోని టిడిపి కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, గౌరవ సలహాదారుడు కాశ్ర తిరుమలేష్ చౌదరి, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ బుగ్గనపల్లె రమేష్, మాజీ ఎంపీటీసీ జాకిరుల్ల బేగ్, కౌన్సిలర్ రాంగోపాల్, రామాంజనేయులు, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబిన్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు టైలర్ రాముడు, టిడిపి సీనియర్ నాయకులు రామ్మూర్తి, బుజ్జి వెంకటేశ్వర్లు, మల్లిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, కవి సుబ్బారెడ్డి, నారాయణస్వామి, ఉన్నం వెంకన్న, హెచ్ కొట్టాల మహేష్ నంద్యాల మధు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్, సయ్యద్, అంజాద్, షబ్బీర్ వలి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, సీతారామపురం మద్దయ్య, నాగరాజు, కానాల అంజి, చింతకాయల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బనగానపల్లె : దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి


ఆత్మకూరు : మాట్లాడుతున్న టిడిపి నేతలు

అంగన్వాడీ కేంద్రానికి రస్తా ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-2కు రస్తా ఏర్పాటుపై ఎంపీడీవో గోపీకృష్ణ, అడిషనల్ సిడిపిఒ మంగవల్లిలు బుధవారం పరిశీలించారు. పాముల పాడు ఎస్సీ కాలనీలో ఊరికి చివరగా ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వర్షాకాలంలో పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి చిన్న పిల్లలకు ఇబ్బందికరంగా మారడంతో అంగన్వాడీ కేంద్రం టీచర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీడీవో, ఏసిడిపిఒ సెంటర్‌ను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ముందుగా చెట్లను క్లియర్ చేసి సర్వే చేయించి రస్తా వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అంగన్వాడీ సెంటర్-4 బిల్డింగ్ పూర్తయినప్పటికీ పెయింటింగ్, ఎలక్ట్రిసిటీ ఇన్ కంప్లీట్‌గా ఉండడం వలన సెంటర్ నిరుపయోగంగా ఉండడాన్ని ఎంపీడీవో పరిశీలించారు. పెండింగ్ పనులను గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పూర్తి చేస్తామని ఎంపీడీవో తెలిపారు. వీరి వెంట ఈఓఆర్డి శ్రీనివాస్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

తానా అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనానికి భవాని లీలావతమ్మకు ఆహ్వానం

ప్రజాశక్తి - మహానంది



ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈ నెల 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'నారీ సాహిత్య భేరి' అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై, తెలుగు భాషా సేవకు గిడుగు రామ్మూర్తి పంతులు పురస్కారం అందుకున్న మహానంది మండలం తిమ్మాపురం జడ్పీహెచ్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు భవాని లీలావతమ్మను ప్రత్యేక అతిథిగా తానా సంస్థ వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా భవాని లీలావతమ్మ బుధవారం ప్రజాశక్తి విలేకరితో మాట్లాడారు. తానా వారు నిర్వహిస్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమంలో కవిత్వం వినిపించడానికి తనకు విశిష్టమైన స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ టి. ప్రసాద్, సమన్వయకర్త చిగురుమల్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అంతర్జాలంలో జరిగే ఈ కార్యక్రమం పదికి పైగా మాధ్యమాలలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేస్తారన్నారు. భారతదేశంతో పాటు సుమారు 15 దేశాల కవయిత్రులు, రచయిత్రులు, ప్రముఖ సాహిత్య మహిళలు పాల్గొంటారని తెలిపారు. భవాని లీలావతమ్మకి తానా వేదికపై అవకాశం రావడం సంతోషంగా ఉందని తిమ్మాపురం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, జిల్లా కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.

22న బేతంచెర్లలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - బేతంచెర్ల : పట్టణంలోని స్థానిక శేషారెడ్డి హైస్కూల్ ఆవరణంలో ఈ నెల 22న జగనన్న చెబుదాం జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్‌తో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారని ఎంపీడీవో వెంగన్న తెలిపారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా కలెక్టర్ చర్యలు చేపడతారని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, మండలంలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - శ్రీశైలం : ఎస్సీ వర్గీకరణ వద్దని, కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యమని మాల మహానాడు నియోజకవర్గం నాయకులు జనార్ధన్, మల్లయ్యలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చుపెట్టి, పథకాలను అందకుండా దూరం చేస్తున్నారని తెలిపారు. దళితులకు రిజర్వేషన్ లేకుండా ఎత్తివేయాలనే ప్రయత్నాలను ప్రభుత్వాలు మానుకోవాలని సూచించారు. ప్రైవేటు సెక్టార్‌లో కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నవరత్నాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దళితులకు నిలిపివేసిన 27 పథకాలను వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరారు. దళితులకు గ్రామాల్లో స్మశానం స్థలం కేటాయించి అన్ని వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : రుద్రవరం మండలం ఆలమూరు గ్రామ పంచాయతీ పరిధిలో అంకాలమ్మ చెంచు గూడెం వాసులకు గృహాలు, రోడ్లు, కరెంటు, మంచినీళ్లు, డ్రెయినేజీ కాలువలు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఐఎఫ్‌టియు అధ్యక్ష కార్యదర్శు వై. ఆశీర్వాదం, కె.అరుణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం రుద్రవరం తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్, ఎంపీడీవో త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

జిపిఎస్‌ను ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ప్యాపిలి : జిపిఎస్‌ను రద్దు చేసి ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కృష్ణా నాయక్, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్‌లు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎపి కేబినెట్ సమావేశంలో జిపిఎస్ విధానానికి ఆమోదం తెలిపినట్లు ప్రకటించారని, ఈ విధానం వల్ల 3 లక్షల మంది ఉద్యోగులకు తీరని నష్టం వాటిల్లితుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే పాత పెన్షన్ విధానం కోసం పోరాడే అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

22న నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - బేతంచర్ల : ఈనెల 22న బేతంచెర్ల పట్టణంలోని శ్రీ శేషారెడ్డి హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి ఎస్‌జిఎఫ్ టోర్నమెంట్ కం సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు డోన్ నియోజకవర్గం ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్, బేతంచెర్ల కోఆర్డినేటర్ వెంకట్ నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక శేషారెడ్డి హై స్కూల్ హెడ్మాస్టర్ అబ్రహంతో కలిసి నియోజకవర్గస్థాయిలోని పిఈటిలతో సమావేశం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు అండర్-14, 17లలో విజేతలయిన వారు పాల్గొనాలని తెలిపారు.

నాటుసారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని కండమనాయన పల్లె పరిసర ప్రాంతాల్లో ఉన్న కొండల్లో నాటు సారా బట్టీలపై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. బనగానపల్లె ఎన్ఫోర్స్మెంట్ అధికారి దౌలత్ ఖాన్ మాట్లాడుతూ 4 బట్టీల్లో నిలువ ఉంచిన 2500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. సిబ్బంది వెంకటరమణ, వెంకటనాయుడు, పాములేటి పాల్గొన్నారు. **పాణ్యం :** నంద్యాల అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు పర్యవేక్షణలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్, ఇంటెలిజెన్స్ టీం, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు లక్ష్మణ్ దాస్ అధ్యక్షతన పాణ్యం మండలం రాంభూపాల్ రెడ్డి తాండ గ్రామ పరిసర ప్రాంతాల్లో 3 నాటు సారా బట్టీలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. 5,700 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని అధికారులు తెలిపారు. అధికారులు ప్రవీన్ కుమార్, శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - అవుకు : జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఆరోగ్య రక్ష అని ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ యమునా ఆరోగ్య వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకం వివరాలను తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పగిడ్యాల : గ్రామాలలో తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమణ, మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పైపుల లీకేజీ, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పైపులు లీకైతే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ఈఓఆర్డి నాగేంద్రయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీల కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులుంటే అధికారుల దృష్టికి తేవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : ఓటర్ల జాబితాలో తప్పులుంటే అధికారుల దృష్టికి తేవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో 277 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 22 కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు తెలిపారు. 12 కేంద్రాలు కొత్త ప్రాంతానికి పంపడానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తేవాలన్నారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, తహసిల్దార్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ధోని ఆల్ఫ్రెడ్, పుష్పకుమారి, ఎన్నికల డిప్యూటీ దాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి ,ఏఎస్ఓ వెంకట్రామిరెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, వైసిపి నాయకులు అనిల్, టిడిపి నాయకులు మాధవరెడ్డి, జనసేన నాయకులు నాయకులు భాస్కర్, గురప్ప, బిజెపి నాయకులు లింగన్న, యాదగిరి, బిఎస్‌పి నాయకులు చెన్నయ్య, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

టిడిపి మద్దతుదారున్ని పోలీసులు కొట్టారని..

పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- ఎస్ఐతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని తెలుగు పేటలో వినాయక విగ్రహాల వద్ద జరిగిన ఘర్షణలో పోలీసులు టిడిపి మద్దతు దారుడు బోయ అంజీని స్టేషన్‌కు పిలిపించి కొట్టారని బుధవారం పోలీస్ స్టేషన్ వద్దకు బంధువులు, టిడిపి మద్దతుదారులు అధిక సంఖ్యలో రావడంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ రామిరెడ్డితో మాట్లాడారు. గణేష్ విగ్రహాల వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడితే ఒకరిని స్టేషన్ పిలిపించి కొట్టడం సమంజసం కాదన్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేయాలన్నారు. దీంతో ఎస్సై ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలోని తెలుగు పేటలో ఈ నెల 19వ తేదీ రాత్రి బోయ అంజి ప్రతాప్ వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ప్రతాప్ ఫిర్యాదు మేరకు అంజిని విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిపారు. పోలీసులు ఎలాంటి దాడి చేయలేదన్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు


ఎస్సైతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

22న జిల్లా కేంద్రంలో నిమజ్జనం

- మతసామరస్యంతో ప్రజాశంతంగా జరుపుకోవాలి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 22వ తేదీ నిర్వహించే వినాయక నిమజ్జోత్సవాన్ని మతసామరస్యంతో ఒకరినొకరు సహకరించుకుంటూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ముగించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులకు, అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ సభ్యులతో ద్వితీయ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద నిర్వహించే వినాయక నిమజ్జోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతసామరస్యంతో నిర్వహించుకోవాలని సూచించారు. వాట్సాప్‌లో ప్రసారమయ్యే రూమర్లను ప్రజలు నమ్మద్దని విస్తృత ప్రచారం కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం అధికారుల చేపట్టాల్సిన పనులు నేటి సాయంత్రంలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రార్థన సమయాల్లో ఎలాంటి డ్రమ్స్, అధిక శబ్దాలతో వాయిద్యాలు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో దాదాపు 260 విగ్రహాలు నిమజ్జనం కానున్నాయని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకున్నామని డిఎస్పి జెసికి నివేదించారు. దాదాపు 500 మంది పోలీస్ బందోబస్తుతో అన్ని పాయింట్లలో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. రోడ్ ప్యాచ్ వర్కులు, భారీ కేడింగ్, అవసరమైన చోట వైద్య శిబిరాలు, చెరువులో పుట్టీలు, స్విమ్మర్లు అవసరమైన వరకు ఏర్పాటు చేసుకొని నిమజ్జనం పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి

కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారుల బృందం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ శ్రీనివాసులను ఆదేశించారు. ఊరేగింపు ప్రదేశాల్లోని ముఖ్య కూడలి ప్రాంతాల్లో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ అధ్యక్షులు గంగిశెట్టి విజయకుమార్, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత జి. రామ కృష్ణారెడ్డి, కార్యాధ్యక్షులు వైద్యం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నెరవాటి అమర్నాథ్, సివి చలం బాబు, నిమ్మకాయల సుధాకర్, కోశాధికారులు ధమాం శంకర్, రమణ పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేసిన జడ్పిటిసి దంపతులు

వినాయకుడికి జడ్పిటిసి దంపతులు పూజలు

ప్రజాశక్తి - పగిడ్యాల : వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతిష్టించిన విఘ్నేశ్వరునికి జడ్పిటిసి పుల్యాల దివ్య, వైసిపి మండలాధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పగిడ్యాల గ్రామంలోని బస్టాండ్‌లోని ఆంజనేయస్వామి ఆలయం సమీపన ఉన్న విఘ్నేశ్వరునికి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపాన, కుంట వీధిలో, జిన్ను సమీపాన ఉన్న విఘ్నేశ్వరులకు జడ్పిటిసి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : క్రీడల్లో సాధించిన సర్టిఫికెట్ల ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17, 14 (బాల, బాలికల) నియోజకవర్గం స్థాయి ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ రెడ్డి, కొత్తపల్లి జెడ్పిటిసి సుధాకర్ రెడ్డిలు లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి అధ్యక్షత వహించారు. సాయంత్రం విజేతలకు పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి, శాప్ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్‌లు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్జిఎఫ్ నిర్వాహక కార్యదర్శి శ్రీనాథ్, వైస్ చైర్మన్ ప్రశాంతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రహత్, కౌన్సిలర్లు రూపాదేవి, చిన్నరాజు, లాలూ ప్రసాద్, రవూఫ్, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఉస్మాన్ బేగ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జలీల్ బాషా, తహశీల్దారు రాజశేఖర్ బాబు, జిల్లా శాప్ కో-ఆర్డినేటర్ రవికుమార్, నంది కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, నందికొట్కూర్, మిడుతూరు ఎంఇఓలు ఫైజున్నిసా బేగం, శ్రీనాథ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సభకు అపూర్వ స్పందన : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజల్లో అపూర్వ స్పందన వచ్చిందని, డోన్ పట్టణంలో జరిగిన సిఎం బహిరంగ సభ విజయవంతమయిందని బేతంచెర్ల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. సిఎం సభను విజయవంతం చేసిన ప్రజలకు, మహిళలకు, వైసిపి నాయకులకు ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు ముర్తుజావలి, ఖాజా, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి, వాల్మీకి డైరెక్టర్ మురళీకృష్ణ, గూని నాగరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఫ్లాట్ దస్తగిరి, కాజా, నిరంజన్, రంగాపురం జగన్ మోహన్ రెడ్డి, గూటిపల్లి సర్పంచి శ్రీరాములు, నాగరాజు, తిరుమలేష్, ఎద్దులన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి, చైర్మన్ తదితరులు

అక్టోబర్ 28, 29న ప్రాజెక్ట్ హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

- మాజీ సిబిఐ జెడి వివి లక్ష్మి నారాయణ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ పాఠశాల ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా అక్టోబర్ 28, 29న గోల్డెన్ జూబ్లీ సమావేశాలు ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాల్సిందిగా పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్, మాజీ సీబీఐ జెడి వివి లక్ష్మినారాయణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యంగా డ్యాం నిర్మాణంలో పని చేసిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించాలని తీర్మానించామన్నారు. అధ్యక్షులు చంద్ర శేఖర్, ఎల్లారెడ్డి, మక్బూల్, వెంకట రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


5వ పేజీ తరువాయి... ఎస్సై జగన్మోహన్ పర్యవేక్షించారు. **డోన్ :** డోన్‌లో ప్రశాంతంగా వినాయక నిమజ్జన వేడుకలు ముగిశాయని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అబ్బిరెడ్డి పల్లె చెరువులో వినాయక నిమజ్జనం నిర్వహించారు. పట్టణంలోని ప్రజా వైద్యశాల వీధిలో వానర సేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని లడ్డు వేలం పాటలో డి.చంద్రశేఖర్ గౌడ్, జయశ్రీ దంపతులు రూ.44,500లకు దక్కించుకున్నారు. స్వామి వారి వస్త్రాలను కె.వెంకటేశ్వర్లు, లీలావతి దంపతులు 5,116లకు దక్కించుకున్నారు. **ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలో వినాయక విగ్రహాలను పాములపాడు మండలం ఎర్ర గూడూరు వద్ద ఉన్న తెలుగు గంగ కాల్వలో నిమజ్జనం చేశారు. అంతకుముందు విగ్రహాల ఊరేగింపును పట్టణంలోని ప్రజలు భారీ ఎత్తున కర్నూలు గుంటూరు రహదారి ఇరువైపులా నిలబడి తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. **పగిడ్యాల :** వినాయక చవితి పండుగను ఏర్పాటు చేసిన వినాయకులకు గత మూడు రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కెసి కెనాల్‌లో, శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో భక్తులు నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్లతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికి నిమజ్జనం నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **చాగలమర్రి :** మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కూలూరు గ్రామ సమీపంలోని వక్కిలేరులో నిమజ్జనం చేశారు. నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆళ్లగడ్డ డిఎస్‌పి వెంకట్రామయ్య కోరారు. చిన్న వంగలి గ్రామాన్ని ఆయన చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, చాగలమరి ఎస్సై రమణయ్య ఉన్నారు.

రైతులకు పూర్తి నష్ట పరిహారమివ్వాలి

- రైతు సంఘం, వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పంట నష్టపోయిన రైతులకు పూర్తి నష్ట పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం, వ్యకాసం ఆధ్వర్యంలో బుధవారం జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామ సచివాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎం.కర్ణ, టీ.రసూల్ మాట్లాడారు. కార్యక్రమంలో దుబాయ్ బాబు, సగినేల బాలస్వామి, నూర్ భాష, ఖలీల్, స్వామి దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..



రుద్రవరంలో..

మిడుతూరులో...


చాగలమర్రిలో...


కొత్తపల్లిలో..


వెలుగోడులో..


కొలిమిగుండ్లలో..


పగిడ్యాలలో..
